గుర్తుకొస్తున్నాయి..

విద్యార్థి దశలో వేసవి సెలవులను ప్రశాంత వాతావరణంలో గడపడానికే ఎవరైనా ఇష్టపడతారు. అమ్మమ్మ–తాతయ్య ఇళ్లకు కుటుంబం, స్నేహితులతో వెళ్లి సరదాగా గడుపుతారు. 'విద్యార్థి దశలో వేసవి సెలవులు ఎలా గడిపారు' అనే అంశంపై ఉన్నత స్థానాల్లో స్థిరపడిన ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రముఖుల అనుభవాలతో నమ్మర్ స్పెషల్ స్టోరీ.

8లో ▶



న్యూస్‌రీల్

భూభారతితో సమస్యలు పరిష్కారం

- అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

కుంటాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి పథకంతో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్ అన్నారు. సూర్యాపూర్ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని లింబా(బి), అంబకంటి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి ఆర్డీవో కోమల్‌రెడ్డి దరఖాస్తులు స్వీకరించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కమల్‌సింగ్, ఎజాజ్‌అహ్మద్‌ఖాన్, ప్రవీణ్ కుమార్, డీటీ నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నిబద్ధతతోనే గుర్తింపు



సీఐ గోపీనాథ్‌కు కేక్ తినిపిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్: నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే సరైన గుర్తింపు లభిస్తుందని ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. పట్టణ సీఐ జి.గోపీనాథ్ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయనకు మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. ఆపద సమయంలో స్పందించి సేవలందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు కె.గణేశ్, శ్రీనివాస్‌యాదవ్, మహమ్మద్‌గౌస్, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా సమ్మర్‌క్యాంప్‌కు..



కడెం జెడ్పీ పాఠశాల సమ్మర్ క్యాంప్‌లో పిల్లలు

కడెం: యంగ్‌ఇండియా సమ్మర్‌క్యాంప్‌లకు వెళ్లేందుకు విద్యార్థులు ఉత్సాహం కనబరుస్తున్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్‌క్యాంప్‌లో చెస్, క్యారం, క్రికెట్, తదితర క్రీడలతోపాటుగా డ్రాయింగ్, క్రాఫ్ట్‌లలో శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు నగేశ్, స్వాతి తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్‌పై దాడి హేయమైన చర్య

నిర్మల్‌ఖిల్లా: ప్రభుత్వ విధుల నిర్వహణలో ఉన్న పెద్దఅంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్ రవీందర్ నాయక్ దాడిని జిల్లా గజిటెడ్ ఉద్యోగుల సంఘం ఖండించింది. ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పీజీ రెడ్డి, ధాత్రిక రమేశ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధినిర్వహణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తారని, అలాంటి వారిపై భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఇలాంటి అమానుష చర్యలు మున్ముందు జరుగకుండా నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలి



అటవీ ప్రాంతంలో గాలిస్తున్న ఎఫ్‌బీవో

నర్సాపూర్(జి): పశువుల, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌బీవో సాయిరెడ్డి సూచించారు. మండలంలోని కుస్లి గ్రామ శివారులో సోమవారం గొర్రెపై చిరుతపులి దాడి చేసిన విషయం తెలిసిందే. అటవీ ప్రాంతంలో చిరుత సంచరించిన ఆనవాళ్లను అటవీ అధికారులు మంగళవారం గుర్తించారు. ప్రజలు ఒంటరిగా అడవిలోకి వెళ్లొద్దని సూచించారు. పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ఫోన్.. బ్యాన్!



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లను అతిగా వినియోగిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ వినియోగాన్ని నిషేధించాలని ఆదేశించారు. జూన్ నుంచి ఈ ఆదేశాలు పటిష్టంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ నిర్ణయం బోధన ప్రక్రియలో అంతరాయాలను తగ్గించి, నాణ్యమైన విద్యను అందించడానికి దోహదపడుతుందని తెలిపారు.

– నిర్మల్‌ఖిల్లా

నిషేధం ఆదేశాలు..

ఉపాధ్యాయులు తరగతి సమయంలో మొబైల్ ఫోన్లలో నిమగ్నమవడం వల్ల బోధన–అభ్యసన ప్రక్రియకు ఆటంకం కలుగుతోందని విద్యాశాఖ గుర్తించింది. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్డీలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో, డీఈవోలు, డైట్ ప్రిన్సిపాళ్లకు పాఠశాలల్లో మొబైల్ నిషేధంపై దిశానిర్దేశం చేశారు. జిల్లా విద్యాధికారులు ఈ ఉత్తర్వులను జారీ చేయాలని నిర్దేశించారు.

జిల్లాలో ఇలా...

నిర్మల్ జిల్లాలో 735 పాఠశాలల్లో 50 వేల మంది విద్యార్థులు, 2,500 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నప్పటికీ, ప్రవేశాల సంఖ్య తగ్గుతోంది. దీన్ని అధిగమించేందుకు, గ్రామస్తులు, తల్లిదండ్రుల సహకారంతో ప్రవేశాలను పెంచి, నాణ్యమైన విద్యను అందించే కార్యాచరణ రూపొందిస్తున్నారు.

మౌలిక సదుపాయాలు..

పాఠశాలల్లో యుడైస్ ప్లస్ పోర్టల్ ద్వారా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఏఐ ఆధారిత బోధనను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రవేశపెట్టారు, దీనిని దశలవారీగా విస్తరించనున్నారు. ఉపాధ్యాయులకు ఆధునాతన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రాజురా పాఠశాలలో విజయవంతం..

లోకేశ్వరం మండలం రాజురా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో "ఫోన్ లాకర్" వ్యవస్థను అమలు చేస్తున్నారు. 300 మంది విద్యార్థులతో, ఆరుగురు రెగ్యులర్ ఉపాధ్యాయులు, 9 మంది విద్యావాలంటీర్లు పనిచేస్తున్నారు. హాజరు నమోదు తప్ప, ఫోన్లను లాకర్‌లో ఉంచుతారు. ఈ విధానాన్ని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి ప్రశంసించారు.



బడిలోకి రాగానే స్టాఫ్‌రూమ్‌లో మొబైల్ ఫోన్‌లను డిపాజిట్ చేసేస్తారిలా...

ఇలా అమలుపరిస్తే ఎంతోబాగు..

ప్రస్తుతం సాంకేతికత వినియోగంలో భాగంగా మొబైల్ ఫోన్ ప్రాధాన్యత కూడా పెరిగిపోయింది. మరోవైపు మొబైల్ ఫోన్ వినియోగించకుండా తరగతి గదిలో బోధన అభ్యసన ప్రక్రియ చేపట్టాలనుకుంటున్న పాఠశాల విద్యాశాఖ నిర్ణయంపట్ల జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే మొబైల్ ఫోన్ వినియోగం సాధ్యమైనంత వరకు తగ్గిస్తూనే అవసరమున్న చోట మాత్రమే వినియోగించేందుకు ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు.

అందరి సమన్వయంతో..



తరగతి గదిలో ఫోన్ వినియోగం వద్దని చెప్పే ఉత్తర్వులు గతంలో నుంచి ఉన్నవే. అయినా తాజాగా పకడ్బందీగా అమలుచేయాలని మారోమారు ఇటీవలి రాష్ట్ర స్థాయి శిక్షణ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఆదేశించారు. తదనుగుణంగా జిల్లాలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తగిన మార్గదర్శకాలిస్తాం. రానున్న విద్యాసంవత్సరం నుంచి ఉపాధ్యాయసంఘాల ప్రతినిధులు, మండల విద్యాధికారులు ,ఉపాధ్యాయుల సమన్వయంతో పటిష్టంగా అమలు చేస్తాం.

– పి.రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి

సవాళ్లు..

మొబైల్ నిషేధం అమలులో హాజరు నమోదు వంటి సాంకేతిక అవసరాలు సవాలుగా ఉన్నాయి. పరిమిత వినియోగాన్ని అనుమతించాలని కొందరు సూచిస్తున్నారు. రాజురా వంటి ఉదాహరణలు ఈ నిషేధం సాధ్యమని చూపిస్తున్నాయి.

రియల్ హీరోస్‌కు గుర్తింపు

- ప్రతికూల వాతావరణంలో..
- ముగ్గురి ప్రాణాలు కాపాడిన ఖాకీలు
- ఏడాది తర్వాత సీఐ గోపీనాథ్, ఎస్సై శ్రీకాంత్‌కు అవార్డులు

నిర్మల్: 21 జులై 2024, అర్ధరాత్రి 2 గంటల సమయం. నిర్మల్ జిల్లాలో వర్షం ఆగకుండా కురుస్తోంది. నిర్మల్ బస్టాండ్ వద్ద నైట్ పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న డీసీఆర్‌బీ సీఐ జి. గోపీనాథ్, సారంగపూర్ ఎస్సై సల్ల శ్రీకాంత్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అప్పుడే వచ్చిన ఫోన్ కాల్ వారిని అలర్ట్ చేసింది. మహబూబ్‌ఘాట్‌లో కారు లోయలో పడిపోయిందని, అందులోని వారు ప్రమాదంలో ఉన్నారని తెలిసింది. వెంటనే వాహనాన్ని ఘాట్ వైపు పరుగులు పెట్టించారు.

లోయలో చిక్కుకున్న కుటుంబం

హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు చెందిన దేవికా కల్యాణి, రాధాకృష్ణ దంపతులు తమ కుమారుడైన ప్రేమ్‌తో కలిసి తమ కారులో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వెళ్తున్నారు. హైదరాబాద్ నుంచి ఎన్‌హెచ్ 44పై ప్రయాణిస్తున్నారు. రాత్రి ప్రయాణం కావడంతో గూగుల్ డైరెక్షన్స్‌తో ముందుకు సాగుతున్నారు. సరిగ్గా కడ్తాల్ దగ్గరికి రాగానే వారు బైపాస్‌గుండా వెళ్లాల్సి ఉండగా, గూగుల్ మ్యాప్‌ను ఫాలో అవుతూ.. నిర్మల్ జిల్లాకేంద్రంలో నుంచి పాత ఎన్‌హెచ్ 44 రోడ్డు గుండా వెళ్లారు. సరిగ్గా.. సారంగపూర్ మండలంలో సహ్యాద్రి పర్వతాల చివరి సానువుల్లో ఉన్న మహబూబ్‌ఘాట్ వద్దకు వచ్చారు. అర్ధరాత్రి 1.30 గంటలకు రెండో ఘాట్ కు చేరుకోగానే దారి కనిపించలేదు. అంతే.. రెప్పపాటులో వారి వాహనం అదుపుతప్పింది. రాధాకృష్ణ తేరుకునేలోపే పల్టీలు కొడుతూ కారు లోయలోకి పడిపోయింది. ఒక టేకు చెట్టు అడ్డుకోవడంతో కారు 150–200 అడుగుల లోతులో ఆగింది, లేకుంటే 400 అడుగుల లోతు లోయలో పడిపోయేది.

పురస్కారాలతో సత్కారం

ఈ ధైర్యసాహసాలకు సీఐ గోపీనాథ్, ఎస్సై శ్రీకాంతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా 'తెలంగాణ పోలీస్–రియల్ హీరోస్' అవార్డులను అందుకున్నారు. ఎస్పీ జానకీషర్మిల సహా అందరూ వారి సేవను ప్రశంసించారు. తాజాగా సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జీనెట్‌వర్క్ నుంచి సీఐ గోపీనాథ్(ప్రస్తుతం భైంసా సర్కిల్), ఎస్సై సల్ల శ్రీకాంత్(ఇప్పుడు కూడా సారంగపూర్ స్టేషన్) 'తెలంగాణ పోలీస్–రియల్ హీరోస్' అవార్డులను అందుకున్నారు.



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీఐ గోపీనాథ్, ఎస్సై శ్రీకాంత్

ప్రతికూల వాతావరణంలో...



ప్రమాదంలో చిక్కుకున్నవారిని కాపాడుతున్న సీఐ గోపీనాథ్, ఎస్సై శ్రీకాంత్, పోలీసులు(ఫైల్)

గాయాలతో బయటపడలేని స్థితిలో ఉన్న కుటుంబం, ఒక పాయింట్ సిగ్నల్‌తో 100 నంబర్‌కు కాల్ చేసి సహాయం కోరింది. పది నిమిషాల్లో ఘాట్‌కు చేరుకున్న సీఐ గోపీనాథ్, ఎస్సై శ్రీకాంత్‌లకు చీకటి, వర్షం, పొగమంచు ఇబ్బందులు సృష్టించాయి. కారు పార్కింగ్ లైట్ల సాయంతో స్థానాన్ని గుర్తించి, జారే బురదలో పాకుతూ లోయలోకి దిగారు. ముందుగా దంపతులను, ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బంది సాయంతో ప్రేమ్‌ను సురక్షించారు.

జీవితంలో గుర్తుండిపోతుంది..

ఆరోజు జరిగిన ఘటన, తాము స్పందించిన తీరు ఎప్పటికీ గుర్తుంటాయి. క్షేత్రస్థాయిలో మా విధులను అధికారులు గుర్తించడం, సీఎం చేతుల మీదుగా అవార్డు దక్కడం చాలా ఆనందంగా ఉంది.

–జి. గోపీనాథ్, సీఐ

చాలా సంతృప్తినిచ్చింది..

ఎంతో కష్టపడి పోలీసు జాబ్ సంపాదించాను. ఉద్యోగంలో చేరిన తర్వాత తొలిసారి ముగ్గురి ప్రాణాలు కాపాడటంలో భాగమవ్వడం, ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు దక్కడం చాలా సంతృప్తినిచ్చింది.

–సల్ల శ్రీకాంత్, ఎస్సై

స్వయం ఉపాధికి కార్యాచరణ

- కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ యువ వికాసం పథకంపై ఆయా శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్, ఎకానమిక్ సపోర్ట్ స్కీమ్‌లను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన అర్హులైన అభ్యర్థుల దరఖాస్తులను మండలస్థాయిలో ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి ఈనెల 20వ తేదీలోగా జిల్లా స్థాయి కమిటీకి పంపించాలన్నారు. దరఖాస్తుల పరిశీలనకు బ్యాంకులు వేగంగా స్పందించాలని, రోజువారీ నివేదికలు అందించాలని తెలిపారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ద్వారా లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు, ఇప్పటి వరకు వాటి పరిశీలన స్థితి, బ్యాంకుల వారీగా టార్గెట్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఎల్‌డీఎం రాం గోపాల్, మండలాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శ్రీవాణి, ఎస్పీ జానకీషర్మిల

- జిల్లా జడ్జి శ్రీవాణి

నిర్మల్‌టౌన్: కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని జిల్లా జడ్జి శ్రీవాణి సూచించారు. జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారంపై జిల్లా కోర్టు సమావేశ మందిరంలో పోలీసు ఉన్నతాధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. జిల్లాలో నేరాల అదుపునకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కేసులు పరిష్కారం కాని సందర్భంలో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేలా చూడాలని తెలిపారు. చట్టాల ఆవశ్యకతను వివరించాలన్నారు. జాతీయ న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ కోర్టుల్లో రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో క్రిమినల్, సివిల్, భూతగాదాలు, రోడ్డు ప్రమాదం, వివాహ, కుటుంబ తగాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని వివరించారు. సమావేశంలో జడ్జీలు, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, నిర్మల్ పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్, కృష్ణ, జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, పీపీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లక్ష్యం ఘనం ... నిర్వహణ శూన్యం

- జిల్లాలో నిరుపయోగంగా నీటి తొట్టెలు..
- నాసిరకంగా నిర్మాణం
- కొన్నింటికి లీకేజీలు ..మరికొన్నింటికి బీటలు
- పశువుల దాహార్తి తీర్చని వైనం..

వివరాలు...	
జిల్లాలోని గ్రామాలు	682
పంచాయతీలు	396
నీటితొట్టెలు	953
చేసిన ఖర్చు	రూ.74,41,488
పనిదినాలు	17,362 రోజులు

తానూరు: వేసవి కాలంలో నీటి ఎద్దడితో పశువులు అల్లాడుతున్న నిర్మల్ జిల్లాలో, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.74.41 లక్షలతో నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. చాలా తొట్టెల్లో నీరు లేక, పశువులు చెరువులు, కుంటలపై ఆధారపడుతున్నాయి.

నీటి తొట్టెల నిర్మాణం..

2010 నుంచి 2018 వరకు నిర్మల్ జిల్లాలో 396 గ్రామ పంచాయతీల్లో 953 నీటి తొట్టెలు నిర్మించారు, ఒక్కో తొట్టికి రూ.22,190 ఖర్చు చేశారు. మొత్తం రూ.74,41,488 లక్షల వరకు ఖర్చు చేశారు. పశువుల దాహార్తిని తీర్చేందుకు బోరు బావుల సమీపంలో నిర్మించిన ఈ తొట్టెలు, ప్రస్తుతం నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్నాయి. సగానికి పైగా తొట్టెలు నాసిరక నిర్మాణం , నీటి వసతి లేని ప్రాంతాల్లో నిర్మాణం వల్ల వృథాగా మారాయి.

నిర్వహణ లోపాలు

చాలా తొట్టెలు బోరు మోటార్లు చెడిపోవడం, పైప్‌లైన్ మరమ్మతులు లేకపోవడం, విద్యుత్ సౌకర్యం లేకపోవడం వంటి కారణాలతో పనిచేయడం లేదు. కొన్ని తొట్టెలు పగుళ్లు, లీకేజీలతో నిరుపయోగంగా ఉన్నాయి. తానూరు మండలంలోని మహాలింగి, తొండాల, నంద్గాం వంటి గ్రామాల్లో గ్రామానికి దూరంగా నిర్మించిన తొట్టెలకు నీటి సరఫరా లేక, ఉపయోగం లేదు. కొన్ని గ్రామాల్లో సర్పంచులు కాంట్రాక్టర్‌లుగా మారి తూతూమంత్రగా నిర్మించడంతో తొట్టెలకు పగుళ్లు రావడం, కొన్ని చోట్ల పక్కకు పడిపోవడం, నీళ్ల లీకేజీ ఏర్పడటం లాంటివి ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో అవసరం లేని ప్రాంతాల్లో కూడా నీటి తొట్టెలు నిర్మించడంతో వాటికి నీటి సౌకర్యం లేక వృథాగా పడి ఉన్నాయి.

రైతుల ఆవేదన

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు విన్నవించినా స్పందన లేకపోవడంతో, పశువులు దాహంతో అల్లాడుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడం వల్ల బోర్లు కూడా పనిచేయడం లేదు. డ్వామా, పశుసంవర్ధక, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు మరమ్మతులు చేపట్టి, బోరు మోటార్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మిషన్ భగీరథ నీటిని తొట్టెలకు సరఫరా చేస్తే, వేసవిలో పశువుల దాహార్తి తీరుతుందని రైతులు సూచిస్తున్నారు. సింగిల్ ఫేజ్ మోటార్ల ద్వారా గ్రామ చివరి తొట్టెలకు నీటిని అందించడం కూడా సాధ్యమే.



తానూరు మండలం వాడవన గ్రామంలో బీటలువారిన నీటితొట్టి



ఝరి(బి)తండాలో నీరు లేకుండా..

ఉపయోగంలోకి తేవాలి



సరఫరా లేక పశువుల నీటి తొట్లెలు నిరుపయోగంగా మారుతున్నాయి. పశువుల దాహార్తి తీరడం లేదు. వేసవి నేపథ్యంలో చెరువులు ఎండిపోయాయి. పశువులకు నీరు దొరకడం లేదు. అధికారులు స్పందించి తొట్టెలకు నీటి సరఫరా చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– గంగాధర్, బోరిగాం గ్రామం

నీటి సౌకర్యం కల్పిస్తాం..

ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించిన తొట్టెల నిర్వహణను సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు చూసుకోవాలి. ఆయా గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టెల వివరాలను తెలుసుకుని సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి మిషన భగీరథ నీటి సౌకర్యం కల్పించి ఉపయోగంలో తీసుకువస్తాం.

– నాగవర్ధన్, డీఎల్పీవో

విభేదాలు వీడి ఐక్యంగా పనిచేయాలి

- పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, అవేజ్
- రసాభాసగా ముధోల్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం

భైంసాటౌన్: పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం రసాభాసగా మారింది. పీసీసీ పరిశీలకుల ముందే నేతలు, వారి అనుచరులు బాహాబాహీకి దిగడంతో గందరగోళం నెలకొంది. పార్టీలో కొత్తగా చేరినవారికే ప్రాధాన్యత ఇస్తున్నారని, పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు ఉండడం లేదంటూ మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు వర్గీయులు వేదికపై ఉన్న పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, ఎండీ.అవేస్ దృష్టికి తెచ్చారు. దీంతో మాజీ ఎమ్మెల్యే జి విఠల్‌రెడ్డి వర్గీయులు, పటేల్ వర్గీయుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. దాదాపు అరగంటకుపైగా ఆరోపణలు, ప్రత్యారోపణలతో గందరగోళం నెలకొంది. రాష్ట్ర నేతలు కలుగజేసుకుని సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం సభనుద్దేశించి పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నేతల మధ్య సఖ్యత లేకనే కాంగ్రెస్ పార్టీ విచ్ఛిన్నమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాయితీపై వంటగ్యాస్ సిలిండర్, ఉచిత గృహ విద్యుత్, రైతులకు రుణమాఫీ, రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం వంటి హామీలు అమలు చేస్తున్నా.. గ్రూపు తగాదాలతో నియోజకవర్గంలో పార్టీ చతికిలపడి, మూడో పార్టీ బలం పుంజుకుంటోందన్నారు. ఇప్పటికైనా నేతలు విభేదాలు వీడి పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారు. పార్టీ విధానాల ప్రకారం.. నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ ఆధ్వర్యంలోనే పార్టీ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. అందరు కలిసికట్టుగా పనిచేసి, రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బి.నారాయణ్‌రావు పటేల్, జి.విఠల్‌రెడ్డి, ఎస్.వేణుగోపాలచారి, ఏఎంసీ చైర్మన్ సిందే ఆనంద్‌రావు పటేల్, వైస్ చైర్మన్ ఫారూక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్



వాగ్వాదానికి దిగిన పటేల్, విఠల్‌రెడ్డి వర్గీయులు

గుర్తుకొస్తున్నాయి..

- వేసవి సెలవులు పల్లెటూళ్లలోనే..
- అంతా అమ్మమ్మ–తాతయ్య ఇళ్లకే..
- మధుర జ్ఞాపకాల్లోకి ప్రముఖులు



విద్యార్థి దశలో వేసవి సెలవులను ప్రశాంత వాతావరణంలో గడపడానికే ఎవరైనా ఇష్టపడతారు. కొత్త అనుభవాలు, అనుభూతులు పొందటానికి ఆసక్తి చూపుతారు. సరికొత్త నైపుణ్యాలు, విషయాలను నేర్చుకోవటానికి సిద్ధపడతారు. మరికొందరు అమ్మమ్మ–తాతయ్య ఇళ్లకు కుటుంబం, స్నేహితులతో వెళ్లి సరదాగా గడుపుతారు. 'విద్యార్థి దశలో వేసవి సెలవులు ఎలా గడిపారు' అనే అంశంపై ఉన్నత స్థానాల్లో స్థిరపడిన అధికారులు, ప్రముఖులు తమ అనుభవాలను 'సాక్షి'తో ఇలా పంచుకున్నారు.

కాలం వెనక్కిపోతే బాగుండు



మంచిర్యాల అర్బన్: వేసవి సెలవులు వచ్చాయంటే చాలు ఆసిఫాబాద్‌లోని అమ్మమ్మ ఇంటికి వెళ్లేవాళ్లం. అక్కడ నీళ్లు దొరకని సందర్భంలో ఎండ్లబండ్లపై బిందెలు పెట్టుకుని చెలిమెలు తోడి నీళ్లు తెచ్చిన సందర్భాలెన్నో. మక్కజొన్న గట్కా, చిక్కుడు, గుమ్మడి కూర, పచ్చి కూరగాయలు దొరకని సందర్భంలో రకరకాల వరుగులతో అమ్మమ్మ వంటలు ఎంతో మధురంగా చేసేది. రాత్రివేళ పెరట్లో నులక మంచాల్లో పడుకుని వెన్నెల, నక్షత్రాలను చూస్తుండేవాళ్లం. కూని రాగాలు తీస్తూ ఆదమరిచి నిదురించేవాళ్లం. అమ్మమ్మ–తాతయ్య కథలు, కావ్యగానాలు అపూర్వమైనవి. ఇంట్లో పెద్దలకు చెప్పకుండా ఎడ్లబండి కట్టుకుని వెళ్తుండగా ఒక ఎద్దు తప్పించుకుంది. అప్పుడు అందరం కలిసి బండిని లాక్కుని వచ్చి అదే స్థలంలో ఉంచేవాళ్లం. ఈతకు వెళ్లి నీటిలో మునిగి పోతుంటే తమ్ముళ్లు కాపాడిన విషయం ఎప్పటికీ మరిచిపోను. గ్రామంలో రాత్రివేళ ప్రదర్శించిన రామాయణం, డ్రామాలను ఇంటిల్లిపాదితో కలిసి చూడటం మరిచిపోని జ్ఞాపకాలు. ఒక్కసారి కాలం వెనక్కిపోతే బాగుండు అనిపిస్తోంది.

– వామన్‌రావు, కవి, సాహితీ సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాల

పౌరాణిక కథలు వినేవాళ్లం



మంచిర్యాల అర్బన్: వేసవి సెలవులకు మా ఊరు పెద్దంపేట్‌కు వెళ్లేవాళ్లం. అక్కడ మా తాతయ్య అనేక పౌరాణిక కథలు చెబుతుంటే మిత్రులతో కలిసి వినేవాళ్లం. హాజీపూర్ మండలం కేంద్రంలో నాలుగో తరగతి వరకు చదువుకున్నాను. ఐదో తరగతి నుంచి ఏడో తరగతి వరకు అక్కవాళ్ల ఊరు వెల్గటూర్ మండలం చెగ్యామలకు వెళ్లాల్సి వచ్చింది. అప్పట్లో సెలవులు రాగానే అందరం పెద్దంపేట్‌కు వచ్చేవాళ్లం. మాది వ్యవసాయ కుటుంబం కావటంతో అడవికి వెళ్లి కట్టెలు తీసుకువచ్చేవాళ్లం. నానమ్మ–తాతయ్యతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్తూ సరదాగా గడిపేవాళ్లం. రోడ్డు వెంట అల్లనేరేడు చెట్లుండేవి. మిత్రులతో కలిసి పండ్లు రాల్చిన రోజులు ఇప్పటికీ గుర్తున్నాయి. మోటబావి పక్కనున్న జామ చెట్టు పైనుంచి పండ్లు కిందపడగానే తిన్న రోజులు ఎప్పటికీ మరిచిపోలేను. బాల్యంలో స్నేహితులతో కలిసి గడిపిన మధురానుభూతులన్నీ ఇప్పటికీ గుర్తుకొస్తున్నాయి.

– అంజయ్య, డీఐఈవో, మంచిర్యాల

అప్పటి తీపిజ్ఞాపకాలేవి?



నిర్మల్‌ఖిల్లా: ఆరు దశాబ్దాల క్రితం నాలుగు నుంచి పదో తరగతి వరకు ఖానాపూర్‌లో చదివాను. గోదావరి నది మా ఇంటి సమీపంలోనే ఉండేది. వేసవి సెలవుల్లో అందులో ఈత నేర్చుకునే వాళ్లం. మా అమ్మమ్మ ఊరు రాయికల్‌కు వెళ్లాలంటే గోదావరి నదిని ఎడ్లబండిలో దాటేది. ఆ తర్వాత ప్రైవేట్ వాహనంలో వెళ్లేవాళ్లం. మామిడి కాయలు కోసి దోస్తులమంతా ఉప్పు పెట్టుకుని తినేవాళ్లం. దగ్గరలోని గ్రంథాలయానికి వెళ్లి బాలలబొమ్మల పుస్తకాలు చదివేది. నమ్మక్, గిల్లీ–దండా, కోతికొమ్మ, గోలీలు, కబడ్డీ లాంటి ఆటలు ఆడేది. కొత్త ఆవకాయ, అన్నం తీసుకెళ్లి ఒత్తుగా కలుపుకొని గోదావరి ఒడ్డున కూచోని తింటూ దోసిళ్లతో నీళ్లు తాగేది. అప్పటి జ్ఞాపకాలు గుర్తొస్తే మళ్లీ కాలం వెనక్కి వెళ్తే బాగుండు అనిపిస్తుంది.

– సంపత్‌కుమార్, నవలా రచయిత, కెనడా రాయబార కార్యాలయ సీనియర్ సలహాదారు

చిన్నప్పటి జిందగినే మస్తుండే..



నిర్మల్‌ఖిల్లా: ఎండాకాలంలో నిర్మల్‌లోని మా బేస్తవార్‌పేట గల్లీ దోస్తులతో దెబ్బల చెండు, మూలలాట, కుంటుడు, దేకుడు, దూకుడు, ముట్టిచ్చుకునుడు, అగ్గిపెట్టెల పత్తాలాట, సిగరెట్ పెట్టెలతో బస్సు కార్లాట, గోటిలాట, ఒక పెద్ద తాడుకు ముడేసి అందులో అందరం లైన్ కొద్ది నిలబడి ముంగటోడు డ్రైవర్, మధ్యలోడు కండక్టర్‌గా ఎన్నో ఆటల్ని ఆడుకునేటోళ్లం. చొప్పబెండ్లతో అద్దాలు, కుర్చీలు, మంచాలు, కార్లు, బస్సులు చేసుకునేటోళ్లం. తాటి ఆకులతో పంకలు చేసుకుని చేతిలో పట్టుకుని పరుగెత్తేవాళ్లం. జొన్న రొట్టెలను పప్పు, ఊరగాయ కలుపుకొని కడుపునిండా తిని వాకిట్ల బొంతలు పరిచిన మంచాల్లో ఆకాశం వైపు చూస్తూ పడుకుండేది. మా బాపువాళ్లు నిర్మల్ చరిత్ర చెప్పేటోళ్లు. రామాయణం, మహాభారతం కథలు కూడా చెప్పేది.

– ధోండి శ్రీనివాస్, నిర్మల్ చరిత్రకారుడు

మోటబావిలో ఈతకొట్టెటోళ్లం



మంచిర్యాల అర్బన్: మాది పాత వరంగల్ జిల్లా (జనగాం) నర్మెట్ట మండల బొమ్మకూర్. వేసవి సెలవులు రాగానే అమ్మమ్మ–తాతయ్య ఊరు హన్మంతపూర్‌కు వెళ్లేవాళ్లం. ఉదయం నుంచి చిన్నపిల్లలందరం కలిసి సిర్రగోనె, కబడ్డీ, చింత పిక్కలు తదితర ఆటలాడేవాళ్లం. సాయంత్రం అయిందంటే చాలు మోటబావిలో అందరం కలిసి ఈత కొట్టేవాళ్లం. ఇంటి ఆవరణలో మామిడి, వేపచెట్లు ఉండేవి. మామిడి కాయలు తెంపి కారం, ఉప్పుతో కలిపి తినటం ఇప్పటికీ మరిచిపోలేం. అమ్మమ్మ చేసే జొన్న అంబలి ఎంతో రుచిగా ఉండేది. రాత్రి కాగానే కుటుంబసభ్యులమంతా వేపచెట్టు కింద మంచం వేసుకుని, నేలపై పడుకుని కబుర్లు చెప్పుకొంటూ నిద్రలోకి జారుకునేవాళ్లం. అప్పట్లో బ్రహ్మంగారి చరిత్ర నాటకాన్ని కళాకారులు ప్రదర్శించగా ఎంతో ఆసక్తిగా చూసేవాళ్లం.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

చెదిరిపోని జ్ఞాపకాలు



మంచిర్యాలక్రైం: వేసవి సెలవుల్లో చిర్రగోనే ఆడిన, గంగయ్యబావిలో ఈత కొట్టిన మధుర జ్ఞాపకాలు మరిచిపోలేనివి. అవి తిరిగిరాని, చెదిరిపోని జ్ఞాపకాలు. మాది సూర్యాపేట జిల్లా అర్వపెల్లి మండలం కొనపెల్లి గ్రామం. మా గ్రామానికి ఐదు కిలో మీటర్ల దూరంలో తిమ్మాపూర్ ఉండేది. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు అక్కడే చదివాను. వేసవిలో ఒంటిపూట తర్వాత ఇంటికి వచ్చేదారిలో గంగయ్య బావి ఉండేది. ఆ బావిలో ఈత కొట్టేవాళ్లం. చింతచెట్టు కింద కబడ్డీ, చిర్రగోనె ఆడెటోళ్లం. చెరువు గట్లపై ఈత పండ్లు, మామికాయలు తెంపుకొని సాయంత్రం ఇంటికి చేరుకునేది. బడికి వేసవి సెలవులు ప్రకటించగానే నల్గొండ జిల్లా ఆకారం అనే గ్రామానికి అమ్మమ్మ ఇంటికి వెళ్లేది. అక్కడ తాటిముంజలతో గిరక బండి చేసుకుని చెరువు గట్టుపైకి వెళ్లేది. ఎడ్లబండ్లంటే నాకు చాలా ఇష్టం. గ్రామాల్లో ఊరు పెద్దమనుషులు చెట్లకింద పంచాయితీలు పెట్టుకునేవారు. అవి వినుకుంటూ చింతచెట్ల కింద చిర్రగోనె ఆడేవాళ్లం. ఎక్కువ శాతం చిర్రగోనె, కబడ్డీ ఆడుతూ.. ఈత కొడుతూ ఎంజాయ్ చేసేవాళ్లం. అవి తిరిగిరానివి, మరిచిపోలేని మధుర జ్ఞాపకాలు.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

కథలు వింటూ నిద్రపోయేది



మంచిర్యాలటౌన్: మాది కాగజ్‌నగర్. వేసవి సెలవులు వస్తే కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం లింగాపూర్ గ్రామంలోని అమ్మమ్మ వాళ్లింటికి వెళ్లేది. మేము నలుగురు ఆడపిల్లలం కాగా నేనే పెద్దదాన్ని. అంతా అమ్మమ్మ ఊరిలోనే గడిపేవాళ్లం. కోతికొమ్మచ్చి, అష్టాచెమ్మా, కైలాసం, దాగుడు మూతలు, మోటబావుల్లో ఈత కొట్టడం ఇలా సరదాగా గడిపేవాళ్లం. రాత్రి ఆరుబయట మా అమ్మమ్మ చెప్పే కథలు వింటూ నిద్రించేవాళ్లం. చిన్నప్పుడే కరాటే నేర్చుకున్నాను. నెలన్నరకు పైగా వేసవి సెలవులు ఇస్తే వేగంగా గడిచిపోయేవి. అమ్మమ్మ చెప్పిన కథలు నేటికీ మర్చిపోలేను.

– నీరటి రాజేశ్వరి, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

ఆటపాటలతో గడిపేవాళ్లం



మంచిర్యాలటౌన్: మాది భీమారం గ్రామం. పుట్టి పెరిగింది అంతా అక్కడే అయినా మా అమ్మమ్మ వాళ్ల ఊరు భూపాలపల్లి జిల్లా దామరకుంట. వేసవి సెలవులు ప్రారంభం కాగానే అక్కడికే వెళ్లేవాళ్లం. మా అమ్మమ్మకు ఐదుగురు కూతుళ్లు, ఐదుగురు కొడుకులున్నారు. పది కుటుంబాల పిల్లలమంతా అమ్మమ్మ వాళ్ల ఊరికే వచ్చేది. 25 మంది వరకు ఒక్కచోట చేరడంతో పండుగ వాతావరణం నెలకొనేది. మా కుటుంబ సభ్యులమంతా కలిసి చిర్రగోనె, గోలీలు, కోతికొమ్మచ్చి, కబడ్డీ ఆడేవాళ్లం. ఈత కొట్టేవాళ్లం. చింతచెట్ల కింద రకరకాల ఆటలు ఆడేది. మా అమ్మమ్మ, పెద్దమ్మ, చిన్నమ్మ, మామయ్యలు, అత్తయ్యలు ఎన్నో కథలు చెప్పేవారు. ఆరుబయట కూర్చుని సరదా ముచ్చట్లు, కథలు, ఆటపాటలతో గడిపేవాళ్లం.

– పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి

సెలవులైపోతే ఏడుపొచ్చేది



ఆసిఫాబాద్‌అర్బన్: నేను రిటైర్డ్ తహసీల్దార్‌ను. మా సొంత గ్రామం సిర్పూర్(టి) మండలం లోనవెల్లి. మేము వేసవి సెలవుల కోసం ఎదురుచూస్తుండే వాళ్లం. వార్షిక పరీక్షలు ముగిసిన మరుసటి రోజే అమ్మమ్మ ఊరు ఆసిఫాబాద్‌కు చేరుకునే వాళ్లం. బంధువులందరితో కలిసి సరదాగా గడిపేవాళ్లం. అమ్మమ్మ కట్టెలపొయ్యిపై వండిన వంట ఎంతో మధురంగా ఉండేది. ఉదయం, సాయంత్రం పెద్దవాగు ఇసుకపై ఆడుకునేవాళ్లం. వాగులో స్నానాలు, పాత ఆలయాల్లో ఆటలకు వెళ్తే సెలవులు తొందరగా గడిచిపోయేవి. సెలవుల తర్వాత ఇంటికి వెళ్లాలంటే ఏడుపొచ్చేది. అప్పటి మధుర జ్ఞాపకాలు జీవితంలో మరువలేం.

– మాసాదె శివ్‌రావ్, లోనవెల్లి

క్లుప్తంగా

జింకను చంపిన కుక్కలు



జింక కళేబరం

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని నంబర్–2 ఇంక్‌లైన్ బస్తీ, గోల్ బంగ్లా బస్తీ వెనకాల ఉన్న అటవీ ప్రాంతంలో మంగళవారం జింకపిల్లలు సంచరించగా వాటిపై వీధి కుక్కలు దాడి చేశాయి. అవి ప్రాణభీతితో పరుగులు పెట్టగా అందులో ఒకదాన్ని కుక్కలు చంపేశాయి. అటవీశాఖ అధికారులు ఘటనాస్థలిని పరిశీలించారు. పంచనామా చేసి జింకపిల్ల కళేబరాన్ని ఖననంచేశారు.

వంగిన మర్రిచెట్టు



నర్సాపూర్(డబ్ల్యూ)లో వంగిన మర్రిచెట్టు

లక్ష్మణచాంద: నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామంలో సోమవారం భూకంపం సంభవించింది. ఈదురుగాలులలూ వీచాయి. దీంతో చెరువు వద్ద ఉన్న మర్రిచెట్టు ఒకవైపు వంగిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

మంచిర్యాలక్రైం: భూ వివాదంలో హెడ్ కానిస్టేబుల్‌పై దాడిచేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన కందుల రాజేశ్వర్ భూపాలపల్లిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. స్థానిక హైటెక్ సిటీకి చెందిన నల్లాల లక్ష్మీనారాయణ, మురళి, రాజేశ్వర్ మధ్య కొంతకాలంగా భూవివాదం ఉంది. మంగళవారం భూపాలపల్లిలో విధులు ముగించుకుని రాజేశ్వర్ బస్సులో మంచిర్యాలకు వచ్చి స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద దిగాడు. ఇది గమనించిన లక్ష్మీనారాయణ, మురళి రాజేశ్వర్‌పై దాడి చేసి గాయపరిచారు. దీంతో రాజేశ్వర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్టీపీపీ సందర్శన

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్టీపీపీని మంగళవారం సంస్థ అటవీ, పర్యావరణ సలహాదారు మోహన్‌చంద్ర పర్గేయిన్ (రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్) సందర్శించారు. 2 టీఎంసీల రిజర్వాయర్లను పరిశీలించారు. వాటిపై ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్‌ను చూశారు. నీటి కుంటలు, రక్షిత అడవులను తనిఖీ చేశారు. నేల స్వభావాన్ని బట్టి మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మించనున్న 800 మెగావాట్ల ప్లాంట్ స్థలాన్ని, భూమిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, డీజీఎంలు శ్రీనివాస్, అలాజుల్లాఖాన్, వాసుదేవమూర్తి, ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి తదితరులున్నారు.

తేనెటీగల దాడిలో తాపీమేస్త్రీ మృతి

- మరో ఇద్దరికి గాయాలు



తండ్రి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సంధ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): తేనెటీగల దాడిలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గోలేటి–1 ఇంక్లైన్ ప్రహరీ మరమ్మతు పనులను కాంట్రాక్టర్ పైడిధర్‌కు అప్పగించారు. మంగళవారం ఉదయం మాదారానికి చెందిన తాపీమేస్త్రీ నర్సయ్య, మైలారపు శ్రీనివాస్, హిమండి దుర్గారావు ఈ పనులకు వెళ్లారు. ఈక్రమంలో పక్కనున్న చెట్టుపై ఉన్న తేనెటీగలు వీరిపై దాడి చేశాయి. ప్రాణభయంతో పరుగులు తీసినా నర్సయ్యకు తీవ్రగాయాలు, మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. నర్సయ్యను గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలున్నారు. విషయం తెలుసుకున్న రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, నర్సయ్యకు ముగ్గురు కూతుళ్లుండగా అందరికీ వివాహాలయ్యాయి. పెద్దకూతురు సంధ్య అన్నీ తానై తండ్రి అంత్యక్రియలు నిర్వహించింది. ఏఐటీయూసీ నాయకులు ఎస్.తిరుపతి, మారం శ్రీనివాస్, ఐఎన్టీయూసీ నాయకులు పేరం శ్రీనివాస్, టీబీజీకేఎస్ నాయకులు గజ్జెల్లి చంద్రశేఖర్, అలవేణి సంపత్ ఏరియా ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబానికి రూ.3లక్షల పరిహారం ఇచ్చేలా కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఒప్పించినట్లు వారు తెలిపారు.

అప్పల బాధతో ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని గుండేగాంకు చెందిన సూర్యవంశీ ప్రసాద్ (49) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శంకర్, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రసాద్ కొన్నేళ్లుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతూ అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని బాధ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి జొన్న చేనుకు కావలాగా వెళ్తున్నట్లు భార్యతో చెప్పి వెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భైంసాలో భారీ అగ్ని ప్రమాదం

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్ రోడ్డులోగల ఆయిల్ ప్యాకింగ్ పరిశ్రమలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఫైర్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కాలనీలో శివశంకర్ ట్రేడింగ్ కంపెనీకి చెందిన ఆయిల్ ప్యాకింగ్ పరిశ్రమలో సోమవారం రాత్రి 2గంటలకు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి యజమానికి సమాచారమివ్వగా వారు చేరుకున్నారు. అనంతరం ఫైర్ సిబ్బందికి సమాచారమివ్వగా వారు చేరుకుని మంటలార్పే ప్రయత్నం చేశారు. నూనె ప్యాకెట్లు, క్యాన్లు ఉండడంతో మంటలు పూర్తిగా అదుపులోకి రాలేదు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.60లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

గాయపడిన వృద్ధురాలు మృతి

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి–44పై సీతాగోంది వద్ద ఆదివారం జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడిన శాంతాపూర్‌కు చెందిన దుబ్బాక పోసాని (70) తీవ్రగాయాలపాలైంది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మిగతా వారు కోలుకుంటున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వివాహిత బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. వివరాలు.. హాజీపూర్‌కు చెందిన బొలిశెట్టి అంజయ్యకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడున్నారు. 2020 డిసెంబర్ 2న పెద్ద కుమార్తె మానుషాకు పాతమంచిర్యాలకు చెందిన గురిజాల రాకేశ్‌తో వివాహం జరిపించాడు. వీరికి మూడేళ్ల కుమారుడు బాలాన్స్ ఉన్నాడు. రెండేళ్లుగా మానుషా తీవ్ర నడుము నొప్పితో బాధపడుతోంది. రెండు నెలల క్రితం నొప్పి తీవ్రం కాగా ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. అప్పటి నుంచి పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి కుటుంబ సభ్యులంతా భోజనం చేసి నిద్రించగా మంగళవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో బయటకు వచ్చి రేకుల షెడ్డుకున్న సీలింగ్ ఫ్యాన్‌కు మానుషా చీరతో ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. మానుషా నడుము నొప్పి భరించలేక బలవన్మరణానికి పాల్పడినట్లు ఆమె తండ్రి అంజయ్య హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వాలేగాంలో చోరీ

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిబాయి శనివారం తన ఇంటికి తాళం వేసి ఇలేగాం గ్రామానికి శుభకార్యానికి వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండగా చుట్టు పక్కలవారు గోదావరిబాయికి తెలిపారు. ఆమె ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసి కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి బీరువాలోని రూ.1.80లక్షల నగదు, 5 తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధిత కుటుంబీకులు తెలిపారు.

ఆటోల చోరీ ముఠా అరెస్ట్

- 27 వాహనాలు స్వాధీనం
- ఐదుగురి అరెస్ట్.. పరారీలో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: ఆటోల చోరీ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 27 ఆటోలు స్వాధీనం చేసుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మంగళవారం వెల్లడించారు. ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ వంతెన వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో నిందితుడు షారూక్ పఠాన్ తాను దొంగిలించిన ఆటోలతో వెళ్తూ పోలీసులను చూసి పరారయ్యాడు. పోలీసులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. అతడిని విచారించగా ఏడుగురు ముఠాగా ఏర్పడి ఆటోలు చోరీ చేస్తున్నట్లు ఒప్పుకొన్నాడు. హైదరాబాద్‌లో ఆటోలను దొంగిలించి వాహన, ఇంజన్ నంబర్లు మార్చి వాటి స్థానంలో నకిలీ నంబర్లు ముద్రించి అమ్మడానికి సిద్ధంగా ఉంచిన సమయంలో పోలీసులు పట్టుకున్నారు. నిందితుల్లో నార్నూర్‌కు చెందిన ఏ–1 యూసుఫ్ ప్రస్తుతం కేఆర్‌కే కాలనీలో ఉంటున్నాడు. ఈయన పరారీలో ఉండగా, జైనూర్‌కు చెందిన ఏ–2 సయ్యద్ పరారీలో ఉన్నాడు. ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్‌కు చెందిన ఏ–3 షారూక్ పఠాన్, అదే కాలనీకి చెందిన ఏ–4 అల్తాఫ్ ఖాన్, నార్నూర్ మండలంలోని నాగల్‌కొండకు చెందిన ఏ–5 షేక్ ఖయ్యూం, అదే గ్రామానికి చెందిన ఏ–6 అఫ్సర్ బేగ్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాహోర్ తాలుకా గొండ్వర్సకు చెందిన ఏ–7 అసద్ ఖాన్ ఉన్నట్లు తెలిపారు. ఏ–1, ఏ–2 పరారీలో ఉండగా, మిగతావారిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. 27 ఆటోలకు సంబంధించిన వివరాలు తెలియగా, తొమ్మిది ఆటోల వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఆటోల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.27లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఏ–1, ఏ–2ను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించినట్లు ఎస్పీ చెప్పారు. ఎవరైనా పాత వాహనాలు అమ్మడానికి వచ్చినప్పుడు వాటి ఒరిజినల్ ఆర్సీ, చేసిస్, ఇంజన్ నంబర్లు చూసి కొనుగోలు చేయాలని సూచించారు. ఎస్పీ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ ఫణిందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ఎత్తిపోతల పథకాల్లో వరుస చోరీలు
- రణవెల్లిలో చోరీ చేస్తుండగా పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ముత్యం రమేశ్

చింతలమానెపల్లి: మండలంలోని రణవెల్లి ఎత్తిపోతల పథకంలో చోరీకి పాల్పడిన ఇద్దరిని పట్టుకున్నట్లు కౌటాల సీఐ ముత్యం రమేశ్ తెలిపారు. మంగళవారం కౌటాలలోని తన కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్సై నరేశ్‌తో కలిసి వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లి మండలం రణవెల్లి గ్రామ సమీపంలో ప్రాణహిత నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించకపోవడంతో నిరుపయోగమైంది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా కేంద్రం లక్మాపూర్‌కు చెందిన డాన్‌సింగ్, గణేశ్ సోడంకి, సతీశ్ సీతారాం, రాజు సాహు, రాజోల్ సాహు ఎత్తిపోతల పథకంలోని పంపుహౌస్‌లో మోటర్లలోని రాగి తీగ చోరీ చేసేందుకు ఏప్రిల్ 13న, 19న రెక్కీ నిర్వహించారు. అదే నెల 26న పంపుహౌస్‌లోని మోటార్లను విడదీసి వెళ్లిపోయారు. విషయాన్ని వాచ్‌మన్ లెండుగురె పోశం గమనించి సమాచారమివ్వగా ఎత్తిపోతల పథకం సూపర్‌వైజర్ శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏప్రిల్ 29న చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల సూచన మేరకు పోశం మరో ఏడుగురు పంపుహౌస్‌పై నిఘా పెట్టారు. ఈనెల 4న నిందితులు మోటర్లలోని రాగితీగను బయటకు తీసి 5న రాత్రి తరలిస్తుండగా గ్రామస్తుల సాయంతో వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఐదుగురిలో ముగ్గురు పారిపోగా డాన్‌సింగ్, గణేశ్ గ్రామస్తులకు చిక్కారు. వీరిని చితకబాదిన గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న ఎస్సై నరేశ్ నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సమీప చెట్లపొదల్లో దాచిన 95కిలోల రాగితీగ, 15కిలోల ప్లేట్లు, ఇతర పనిముట్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాపై గతంలో మహారాష్ట్రలో పలు చోరీ కేసులు నమోదైనట్లు విచారణలో తేలింది. సిర్పూర్(టి) మండలంలోని హుడ్కిలి ఎత్తిపోతల పథకంలోనూ గతంలో చోరీకి పాల్పడ్డారు. హుడ్కిలి ఎత్తిపోతల పథకంలో చోరీ చేసిన సామగ్రిని రూ.3లక్షలకు విక్రయించారు. ఎత్తిపోతల పథకంలో చోరీ చేసిన సామగ్రి విలువ రూ.1.30లక్షలు ఉంటుందని సీఐ వివరించారు.

పాతకక్షలతో బ్లేడ్‌తో దాడి

మంచిర్యాలక్రైం: మద్యం మత్తులో గొడవ పడి ఒకరిపై బ్లేడ్‌తో దాడి చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన కోట గోపి, కాంద్రగొండ రామాంజనేయులు మధ్య కొంతకాలంగా పాత గొడవలున్నాయి. ఈ కారణంగా ఇద్దరు మద్యం మత్తులో మంగళవారం గొడవపడ్డారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం గోపి తనవద్ద ఉన్న బ్లేడ్‌తో రామాంజనేయులుపై దాడి చేయగా స్వల్ప గాయమైంది. రామాంజనేయులును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు. రామాంజనేయులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గొలుసు చోరీ నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న అవినాష్‌కుమార్, కృష్ణ

నిర్మల్‌టౌన్: గొలుసు చోరీలకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఏఎస్పీ అవినాష్‌కుమార్ జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గత నెల 30న నిర్మల్ నుంచి నిర్మల్ రూరల్ మండలం వెంగ్వపేట్‌కు దంపతులు మోటార్ సైకిల్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో కావేరి కుటీర్ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వారి మోటార్ సైకిల్‌ను అడ్డగించి బంగారు గొలుసు, పుస్తెల తాడు అపహరించి బైక్‌పై పరారయ్యారు. బాధితులు నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానిక మంజులాపూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇద్దరు అనుమానాస్పదంగా వచ్చి పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వెంటనే పోలీసులు వారిని పట్టుకున్నారు. నాందేడ్ జిల్లా సోనారి తాలూకాకు చెందిన బాలాజీ, రూరల్ మండలం తలవేద గ్రామానికి చెందిన అలిశెట్టి శ్రీనివాస్‌గా గుర్తించారు. వారిని విచారించగా.. దంపతుల మెడల్లోంచి చైన్, పుస్తెలతాడు దొంగిలించినట్లు ఒప్పుకొన్నారు. వారి నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడు, తులం చైన్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కానిస్టేబుళ్ల సంతోష్, సత్యనారాయణను ఏఎస్పీ అభినందించారు. సీఐ కృష్ణ, ఎస్సై లింబాద్రి, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

అల్లుకున్న తీగలు తొలగింపు



సాక్షి స్పందన

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామ సమీపంలోని చెరువు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను మొక్కల తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. 'ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లేస్తోంది'శీర్షిక సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఏఈ మహేశ్ స్పందించారు. మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగలను తొలగించారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

గాలివాన బీభత్సం



రేవోజీపేటలో కూలిన రేకుల షెడ్డు

దస్తురాబాద్: మండల కేంద్రంతోపాటు బుట్టాపూర్, రేవోజీపేట, మున్యాల గ్రామాల్లో మంగళవారం గాలివాన బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడవకుండా ఉండేందుకు రైతులు ఇక్కట్లు పడ్డారు. గాలివానకు రేవోజీపేటలో కోల బుచ్చవ్వకు చెందిన రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగటంతో సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారు.

ఈదురుగాలులకు విరిగిన చెట్టు



చెట్టును తొలగింపజేస్తున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

కడెం: మండలంలోని పెద్దూర్‌తండా సమీపంలో సోమవారం రాత్రి వీచిన భారీ ఈదురు గాలులకు నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారిపై చెట్టు విరిగిపడింది. విషయం తెలుసుకున్న ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో చెట్టును తొలగించి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

'మహా'జొన్నలను కొనుగోలు చేయొద్దు



అధికారులతో మాట్లాడుతున్న డీఎం ప్రవీణ్‌రెడ్డి

కుంటాల: మహారాష్ట్ర నుంచి వచ్చే జొన్నలను కొనుగోలు చేయొద్దని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి సూచించారు. కుంటాలలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. మహారాష్ట్రలో జొన్నలకు తక్కువ ధర ఉండడం, తెలంగాణలో క్వింటాల్‌కు రూ.3,371 మద్దతు ధర ఉండడంతో సరిహద్దు ప్రాంత రైతులు ఇక్కడికి తరలించి విక్రయించే అవకాశం ఉన్నందున అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, ఏవో విక్రమ్, సీఈవో మురళి, డైరెక్టర్ ప్రణయ్‌రావు తదితరులు ఉన్నారు.

నేడు భైంసాలో పోలీస్ ప్రజావాణి

భైంసాటౌన్: పట్టణంలోని పాతరూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గల ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ డా.జానకీ షర్మిల పోలీస్ ప్రజావాణి నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఆమె కార్యాలయంలో అందుబాటులో ఉండనున్నారు. భైంసా సబ్ డివిజన్‌పరిధిలోని ఫిర్యాదుదారులు నేరుగా కలిసి అర్జీలు అందజేయవచ్చన్నారు. అలాగే భరోసా కేంద్రంలో సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ఒక ప్రకటనలో కోరారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేరండి

కుంటాల: కుంటాల ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు చేరాలని కోరుతూ అధ్యాపకులు బి.గజేందర్, ఉమేశ్‌లు మంగళవారం మండలంలోని రాజాపూర్ తండాలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం కళాశాలలో కల్పించే వసతుల గురించి విద్యార్థులకు వివరించారు.

వంతెన కూలి ఏడేళ్లు



వాడి-కోతల్‌గాం గ్రామాల కూలిన వంతెన

- వాడి గ్రామస్తుల కష్టాలు
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

భైంసారూరల్: మినీ సుద్దవాగుపై కోతల్‌గాం–వాడి గ్రామాలను కలుపుతూ నిర్మించిన వంతెన కూలి ఏడేళ్లు గడిచింది. పల్సికర్ రంగారావు ప్రాజెక్టు నిర్మించిన సమయంలో భారీ వర్షాలతో ఈ వంతెన కొట్టుకుపోయింది. అప్పటినుంచి ఎవరూ పట్టించుకోవడం లేదు. వాగు పై వంతెన లేక రెండు గ్రామాల మధ్య రాకపోకల కష్టాలు తప్పడం లేదు. వాడి గ్రామ జనాభా 200. ఈ గ్రామంలో ఏ అవసరం వచ్చిన వాగు పక్కనే ఉన్న కోతల్‌గాం గ్రామానికి వెళ్తుంటారు. వంతెన కూలిన సమయంలో అధికారులు కొత్త వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారు. నూతన వంతెన నిర్మించాలని ఇప్పటికీ గ్రామస్తులు కోరుతున్నారు.

తిరిగి వెళ్తున్నారు

2 కి.మీ దూరంలోనే ఉన్న కోతల్‌గాంకు ఈ వంతెన పై నుంచి వాడి గ్రామస్తులు వెళ్లేవారు. గత ఏడేళ్లుగా వంతెన లేక గుండేగాం, చింతల్‌బోరి మీదుగా 13 కి.మీ ప్రయాణించి కోతల్‌గాం గ్రామానికి వెళ్తున్నారు. వాడి గ్రామస్తులకు పంచాయతీ కార్యాలయం కోతల్‌గాం కావడంతో ఏ అవసరం ఉన్న అక్కడికే వెళ్తుంటారు. ప్రతీనెల ఆసరా పింఛన్లు, రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే 13 కి.మీ దూరం ప్రయాణించి అక్కడికి చేరుకుంటున్నారు.

వర్షాకాలం కష్టమే

వాడి గ్రామంలో రైతులే ఎక్కువ సంఖ్యలో ఉంటారు. ఈ గ్రామస్తుల వ్యవసాయ భూములన్నీ కోతల్‌గాం శివారులో ఉన్నాయి. వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో ఇక్కడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఏ ఇబ్బందులు ఉండడం లేదు. వర్షాకాలంలో మాత్రం వాగు నీటితో ముందుకు వెళ్లలేకపోతున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మిస్తే గ్రామస్తుల ఇబ్బందులు దూరమవుతాయి.

వంతెన నిర్మించాలి



వంతెన లేక గుండేగాం, చింతల్‌బోరి గ్రామాల మీదుగా పంచాయతీ కేంద్రమైన కోతల్‌గాంకు వెళ్తున్నారు. సుద్దవాగుపై వంతెన కూలి ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త వంతెన నిర్మించాలి. – బాలాజీ, గ్రామస్తుడు

వర్షాకాలంలో ఇబ్బందులు



వర్షం కురిస్తే వాగుకు అవతలి వైపు ఉన్న పంట పొలాలకు వెళ్లలేక పోతున్నాం. వంతెన లేని కారణంగా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం. వేసవిలో వాగులో నీళ్లు లేని కారణంగా ముందుకు నడిచిపోతున్నాం. వర్షాలు పడగానే కష్టాలు మొదలవుతున్నాయి. – సతీశ్, గ్రామస్తుడు

బీజేపీపై విశ్వాసం పెరుగుతోంది

- మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వ పథకాలతో బీజేపీ పార్టీ ప్రజలకు చేరువైందని, ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ పేర్కొన్నారు. పట్టణంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సంఘటన సంరచనా పర్వ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులకు, సంఘటన సంరచనా ప్రభారీలకు మండల కమిటీ సభ్యుల నియామకంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలన్నారు. కమిటీలను ప్రణాళికాబద్ధంగా నిర్మాణం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. గతంలో గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో కమిటీలే క్రియాశీల పాత్ర పోషించాయని గుర్తు చేశారు. గ్రామ గ్రామానికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలోలకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ వైఫల్యాలను వివరించాలని పేర్కొన్నారు. బీజేపీ మహిళలకు పెద్దపేట వేస్తోందని, రాబోయే ఎన్నికల్లో మహిళలను ప్రాధాన్యత కల్పించి, సీట్లు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ప్రాభరీ భస్వపురం లక్ష్మీనర్సయ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రామ్‌నాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపెల్లి గంగాధర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆకుల శ్రీనివాస్, అశోక్, అసెంబ్లీ కన్వీనర్లు అంకం మహేందర్, తాడేవర్ సాయినాథ్, సుమన్, జిల్లాలోని మండల అధ్యక్షులు, ప్రాభరీలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

తానూరు: మండలంలోని బోసి గ్రామంలో బాల్యవివాహం జరుగుతుందన్న సమాచారం అందుకున్న బాలల పరిరక్షణ శాఖ అధికారులు సోమవారం రాత్రి జరగాల్సిన పెళ్లిని అడ్డుకున్నారు. బోసి గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికకు వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో బాలల సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ అధికారులు సోమవారం సాయంత్రం గ్రామానికి చేరుకున్నారు. ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి, ఏఎస్సై బానుప్రసాద్, సీడీపీవో సరోజిని, ఏసీడీపీవో నాగలక్ష్మి, బాల పరిరక్షణ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు వివాహాన్ని అడ్డుకున్నారు. ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించి, బాల్యవివాహంతో ఏర్పడే దుష్పరిణామాలను వివరించారు. అనంతరం ఇరు కుటుంబాల నుంచి కూతురు మేజర్ అయ్యే వరకు వివాహం చేయబోమని హామీ పత్రాలు రాయించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

సన్మానం



నవీన్‌ను సన్మానిస్తున్న నాయకులు

కుంటాల: బీజేపీ మండల అధ్యక్షుడిగా పసుల నవీన్ ఇటీవల ఎన్నికయ్యారు. కాగా ఆయన్ను నిర్మల్ లో జిల్లా నాయకులు సన్మానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కేశెట్టి అశోక్‌కుమార్, రావుల రాంనాథ్, పైడిపల్లి గంగాధర్, తదితరులు ఉన్నారు.

నీటిని మళ్లించి..పంటకు ప్రాణం పోశారు



కడెం ఎడమ కాలువలో ఏర్పాటు చేసుకున్న పైపులు

కడెం: సాధారణంగా వ్యవసాయబావుల నీటిని పైపుల ద్వారా పంటలకు అందిస్తారు. కానీ ఇక్కడ రైతులు పైపులతో కాలువ నీటిని బావులకు మళ్లించి పంటలకు ప్రాణం పోశారు. మండలంలోని పాండ్వపూర్ శివారులోని కడెం ఎడమ కాలువ సమీపంలోని పంటలకు కాలువ నీరే ఆధారం. యాసంగిలో కడెం ప్రాజెక్ట్ ఆయకట్టుకు వారబందీ పద్ధతిన నీటిని అందిస్తుండగా, రైతులు వ్యవసాయ బావులను పైపుల ద్వారా కాలువ నీటితో నింపుతున్నారు. రైతులు తమ పంటలకు నీటిని అందించి సాగునీటి కొరతను అధిగమించారు. ప్రస్తుతం పంటలు పూర్తికాగా, ఇప్పటికి ఆ బావులు నిండా నీటితో కళకళాడుతున్నాయి.



కాలువ నుంచి పొలాలకు రైతులు ఏర్పాటు చేసుకున్న పైపులు



వేసవిలో నిండా నీటితో బావులు

విద్యార్థినికి సన్మానం



శివప్రియను సన్మానిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌టౌన్: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్ డీజీ పాఠశాల విద్యార్థిని శివ ప్రియకు 586 మార్కులు సాధించింది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో విద్యార్థినిని కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం సన్మానించారు. పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. ఎస్.ఆర్ డీజీ జోనల్ ఇన్‌చార్జి నాగేష్ యాదవ్, ప్రిన్సిపాల్ శిరీష, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు రైతులకు అవగాహన

ముధోల్: మండలంలోని వెంకటాపూర్‌లో గురువారం ఉదయం 8 గంటలకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం ముధోల్ ప్రధాన శాస్త్రవేత్త నర్సయ్య ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే రామారావుపాటిల్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావుపాటిల్ హాజరవుతారని పేర్కొన్నారు. రైతులు సకాలంలో రావాలని సూచించారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ



పరిశీలిస్తున్న సీఐ గోవర్ధన్‌రెడ్డి

సోన్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో తాళం వేసిన రెండిళ్లలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. షేక్ అక్బర్, దేశపోయిన భారతకు చెందిన ఇంటి తాళాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి చొరబడి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు అందించిన సమాచారంతో సీఐ గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

70 ఫోన్ల రికవరీ

ముధోల్: మండలంలో ఇప్పటివరకు సీఈఐఆర్‌టీ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న 250 ఫోన్లు గుర్తించి 70 రికవరీ చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చోరీకి గురైన, పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ మేళ ద్వారా బాధితులకు అప్పగించనున్నట్లు తెలిపారు. సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనుగోలు చేస్తే షాపు యజమాన్ని నుంచి రసీదు తీసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సోమ భీంరెడ్డి

నర్సాపూర్(జి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమ భీంరెడ్డి సూచించారు. మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో డీఆర్డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. దొడ్డు, సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సారంగాపూర్ ఏఎంసీ డైరెక్టర్ చంద్యాల మురళి, ఏపీఎం సునంద, సీసీ ముత్యం, సరస్వతి సంఘ మహిళలు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్ధేశించుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పి.రామారావు పటేల్

భైంసాటౌన్: విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆ దిశగా ప్రణాళికతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. ఇటీవల పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన నియోజకవర్గంలోని విద్యార్థులకు మంగళవారం ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్ఎస్ కాటన్‌లో అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా విద్యార్థులకు శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం



మోదీ, ఆర్.కృష్ణయ్య చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమని దర్శించదగ్గ విషయమని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు డా.ఉప్ప కృష్ణంరాజు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, రాజ్యసభ సభ్యుడు, బీసీ ఉద్యమ సారధి ఆర్.కృష్ణయ్య చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ దాదాపు తొమ్మిది దశాబ్దాల అనంతరం కులగణన చేపట్టడం చరిత్రాత్మకమన్నారు. సత్వరమే జనాభా లెక్కలతోపాటు కులగణనను పారదర్శకంగా పూర్తిచేసి రాబోయే కాలంలో వెనుకబడిన తరగతులకు విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయపరంగా లబ్ధి చేకూరేలా రిజర్వేషన్ల అమలు చేయాలన్నారు. బీసీ నాయకులు పొన్నం నారాయణగౌడ్, రాజేశ్వర్, అశ్విన్‌గౌడ్, చిట్టిబాబు, సాయినాథ్ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



పూజలో ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే రామారావుపటేల్ పాల్గొని పూజలు నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. నాయకులు నర్సారెడ్డి, పండిత్‌రావు, చక్రదర్, ప్రతాప్‌సింగ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న బీరప్పదేవుని ఉత్సవాలు



పాల్గొన్న భక్తులు, కళాకారులు

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(కె) గ్రామంలో బీరప్ప దేవుని ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఇంటింటా జోగు కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున సదరు బోనాలతో రాత్రి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా కళాకారుల ఆటపాటలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. కుర్మ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు కృషి

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో రూ.25వేల విలువైన ఆర్వో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు కృషిచేస్తానని బీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ రాథోడ్ రామునాయక్ తెలిపారు. పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను నాయకులు సన్మానించారు. నాయకులు నరేందర్, హరీశ్, అశోక్, కృష్ణ, రాకేశ్, రాజేందర్, భూమేశ్, పాషా, హరిదాస్, అరుణ్, రమేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రారంభం

సోన్: సోన్, మాదాపూర్, కడ్తాల్ రైతు వేదికల్లో మంగళవారం ఫార్మర్ రిజిస్ట్రీని ఏఈవోలు ప్రారంభించారు. మండలానికి చెందిన కొందరు రైతుల వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసినట్లు వారు తెలిపారు. భూమి ఉన్న రైతులందరూ తప్పనిసరిగా తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ అనుసంధానం చేసిన సెల్‌ఫోన్ తీసుకుని ఏఈవోలను సంప్రదించాలన్నారు. ఏఈవోలు ఉమామహేశ్వరి, అశోక్‌కుమార్, ప్రగతి, రైతులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

ఖానాపూర్: మండలంలోని కొత్తపేటకు చెందిన మైస రాజేశుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ దృష్టికి తీసుకెళ్లగా మంగళవారం వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. వెడ్మ ఫౌండేషన్ వైస్ చైర్మన్ అక్షయ్, తదితరులు ఉన్నారు.

రహదారిని కమ్మేసిన పొగ



లోకేశ్వరం: మండలంలోని పంచగుడి సమీపంలో వరి కాదలకు నిప్పంటుకోవదంతో పంచగుడి –లోకేశ్వరం రహదారిని పొగ కమ్మేసింది. దట్టమైన పొగతో రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు, రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని వాహనాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.